పెళ్ళి చూ (త్రా) పులు

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

"జయా!"—అమ్మ పిలుపు విని తుళ్ళిపడింది జయ.

"అవతల పెళ్ళివారు తొందరపడుతున్నారమ్మా పిల్లను చూస్తామంటూ. మీ నాన్నగారసలే ఖంగారు మనుషులు. మరీ ఆశు మేఘాలమీద పరుగు పెడుతున్నారు. పెళ్ళికూతురు అలంకరించుకునేందుకు కాస్తైనా సావకాశముండాలనుకోరు. వేగంగా ముస్తాబుకామ్మా" అంటూ సుందరమ్మగారు జయని బుజ్జగిస్తూ సమీపించింది.

అద్దంలోకి ముఖం చూసుకుంటూ అలాగే ఉండిపోయింది జయ. అర్జంటుగ పిలుచ్చొచ్చారు పెళ్ళిచూపులకని కాస్లు మధ్యలో. 'ఇష్టమున్నా లేకపోయినా తన విధి తను నెరవేర్చాలి. వేరే ఏం ముస్తాబవాలి? హిందూ ధర్మపవిత్రతకు చిహ్నంగా తన వంటిమీద వెన్నముద్దలాంటి శ్వేత వస్త్రము, మంగళప్రదమైన గాజులు కుడిచేతి కుండనే ఉన్నై. కాకపోతే ఎడంచేతి రిస్ట్‌వాచి తీసి రెండుగాజులేసుకుని నొసటను మాత్రం కొంచం కుంకం అద్దుకుంటే సరి! పదహారణాల అమ్మాయిలా తయారవచ్చు!' ఆమె ఆలోచనలోంక లోలికికి రాకుండానే సుందరమ్మగారామెను తొందరపెట్టేరు. 'అదేంటి జయా! ఇంకా అలాగే ఉన్నావ్, ఆ బనారస్ సిల్కుచీరా, ఆ పట్టురవికా తొడుక్కొని చక్కగా ముఖం కడుక్కొని బొట్టు పెట్టుకుని పెళ్ళికూతురులా తయారవకుండా!'

జయ యీలోకంలోకి వచ్చింది. 'అమ్మా నువ్వు చెప్పినట్లు తయారవటానికి అధమం ఒక గంటేనా పడుతుంది. మరీ అవతలవాళ్ళు తొందరపడుతున్నారంటావ్. ఏం ఈ తెల్లచీర బాగులేదూ? కాకపోతే శిగచుట్టుకోవటంచూస్తే నర్సులా ఉందనుకుంటారు. నిజంగా మెడిసన్ ఎలాగు చదువుతున్నాను. నాకు సూటయేదీ డ్రస్సే. ఇందులోనే కావాలంటే వాళ్ళకి కనపడతాను. అంతేకాని సీతామహాలక్ష్మిలా తయారవలేను సుమా! బట్టలుమారితేమాత్రం మనిషి మారిపోతారటే అమ్మా!' జయ మాటల్లో వైరాగ్యం తొణికింది. తనకి పెళ్ళయేవిధం ఉంటే యీ అలంకరణేమీ అడ్డురాదన్నభావం ఆ మాటల్లో దాగుంది.

సుందరమ్మ పరిస్థితిమాత్రం అధ్వాన్నంగా ఉంది. కూతురుకి వైరాగ్యభావం పోగొట్టి అచ్చం పెళ్ళికూతురిలా తయారుచేయకపోతే, అవతలివారీమె డాక్టర్ దుస్తులు చూస్తేమనుకుంటారో? భర్తచూస్తే అమ్మాయిని త్వరగా పంపమని ఉరుకులూపరుగులూ—పచ్చి వెలక్కాయ గొంతులో దిగినట్టుం దామెకు. ఇంతలో భర్త పిలవనే పిలిచాడు 'వేగంగా జయని తీసుకురావే!'. అది పిలుపులా లేదు. ఏదో కొంప మునిగిపోతూంటే వేసిన కేక—ఆమె తన చికాకంతా జయమీద చూపించింది.

'నీ యిష్టం తల్లీ! నర్సు డ్రస్సులోనే పెళ్ళిచూపుల కెడతావో, దొరసాని డ్రస్‌లోనే వెడతావో! మీ నాన్నగారు నన్నింకా తిట్టకుండా వేగంగా నువ్వు నీ యిష్టంవచ్చిన డ్రెస్‌లోనే కనబడిరా. అదృష్టముంటే సరి!'

'పరవాలేదమ్మా! యీ పద్ధతి తప్పేంకాదమ్మా! హై పెచ్చు స్వచ్ఛతకి, సహాయశీలానికీ చిహ్నం తెలుసా!' అంటూండగా నాన్నగారు లోపలికొచ్చి 'పదపద జయా! వాళ్ళకింకా ఏవోపనులున్నాయట' అంటూ ఆమెను తీసుకెళ్ళేరు.

మెల్లగా నడచివస్తూన్న జయని చూచి పెళ్ళికొడుకు తండ్రి కాబోలు 'రామ్మా! కూర్చో!' అంటూ ఆహ్వానించేడు. 'పరవాలే' దనుకుంది జయ.

ఫలహారాలు సేవిస్తూ ప్రశ్నలు విసరటం మొదలెట్టేరు. 'అమ్మాయ్ ఏం చదువుతూంది?'

'మెడిసినండీ'—నాన్నగారి కంఠం గర్వంగా మెల్లగా.

'ఆ అమ్మాయి వాలమూ దుస్తులూ చెప్పకనే చెప్తున్నాయ్!' ఎవరిదీరిమార్కు! అనుకుని క్రీగంట చూసింది. అంత ధైర్యశాలినీ, బుద్ధిమంతుణ్ణి నేనే సుమా! అన్నట్లు చూసిన పెళ్ళికొడుకు తత్వాన్ని ముందుగానే పసిగట్టింది జయ. ఏమైనా యీ సంబంధం తప్పించు భగవాన్! అనుకుని మొక్కుకుంది మనసులో. అయినా యీ దోషిని అనుగ్రహించటానికి నిరాకరించటానికి అధికారులు వాళ్ళు కదూ! అనుకుని అసహ్యంగా వారివేపు చూచింది.

ఆమె తలపుల్లో, వారి నోటినుంచి వచ్చేమాటలు కొన్ని వినలేకపోయింది. ఆమె వాస్తవంలోకి వచ్చేటప్పటికి వారి కొస మాటలు వినపడ్డాయ్. 'అమ్మాయి విద్యావంతురాలవాలని కోరుకున్నమాట వాస్తవమే కాని, ఆమె మగరాయుడులా ఉద్యోగం చేసి, గృహిణీ ధర్మం తిరస్కరించాలని మాఅభిలాష కాదండీ! ఈమె వేషభాషలు చూడగానే మాఅబ్బాయితో కాపురం చేయటానికి సరిపోయేలా అనిపించటం లేదు. క్షమించండి వస్తాం. ఆమెను బాగా చదివించి లేడీ డాక్టర్ గాచేస్తే ఆమె ఎంతేనా రాణిస్తుంది, మరి సెలవిప్పించం'డంటూ తెగదిన్నామన్న కృతజ్ఞతేనా లేకుండా నిర్మొహమాటంగా జయ మీద తమకుసర్వాధికారాలున్నట్లు ఎగతాళిగమాట్లాడి పెళ్లివాళ్ళెళ్ళిపోయారు. వాళ్ళ మాటలుమాత్రం వీళ్ళ హృదయాలలోంచి వెళ్ళిపోకుండా జయనూ నాన్ననూ కాలుస్తూనే ఉన్నై. నాన్న తన చికాకంతా అమ్మమీద చూపబోతూంటే జయ అంది, "ఎందుకు నాన్నా బాధపడతావ్! లేకి మనుషులు. వాళ్ల స్వభావం అంతే. ఎదుటివారి హృదయం కనిపెట్టలేని ఆ మూర్ఖులమధ్యపడకుండా ఉండటమే నా అదృష్టం!"

నాన్న కొంచెం శాంతించి మెల్లగా అన్నాడు. అయినా అమ్మాయ్, "నువ్వలా నర్సులాతయారయి పెళ్ళి చూపులకి రావటం బాగుండలేదమ్మా!"

జయ కొంచెం దెబ్బతింది. నాన్నకూడ అలాగే ఆలోచిస్తున్నాడా! మనిషి విలువలు మనిషిలో కాకుండా ఆమనిషి ధరించే దుస్తులలో ఉంటాయా? ఆమె అయిష్టంగా అంది "ఇకమీదట మామూలుగ తయారవుతా నాన్నా!" జయ బాధగా అక్కడి నుంచి కదిలింది. పెళ్ళివారిమాటలూ, నాన్న మాటలూ ఆమె హృదయంలో గాయపరచినవి. అది మానాలంటే ఎంతకాలమేనా పట్టొచ్చు!

తరువాతనుంచీ జయ మామూలుగా కాలేజీకి వెళ్తూనే ఉంది. రెండు నెలలవరకూ పెళ్ళివారిపేరిట తనని కల్యపరీక్ష చేసి హృదయం గాయపరచటానికెవరూ రాకపోవటం చూసి మనసులో నిట్టూర్పు విడచింది—ఆ రాబందుల కళ్లల్లోంచి తప్పిపోయాం గదా అని.

కాని ఆమె ఊహలు ఫెయిలయ్యాయ్. ఆనాడు తొమ్మిది గంటలకు కాలేజికి బయలుదేర బోతూంటే అమ్మ అంది. "జయా! త్వరగా రామ్మా! సాయంత్రం ఐదుగంటలకి నిన్ను చూసుకుందుకు తుని నుంచి పెళ్ళివారొస్తారు!" ఆ మాటలు వింటూంటే జయకు కాళ్లు వణికేయ్. 'హేభగవాన్! నేనెవర్ని కష్టపెట్టేనయ్యా యిలా బాధిస్తున్నావ్. యీ రోజెవరి ముఖం చూసేనోగాని. హుఁ! వచ్చే పెళ్ళికొడుకు తనని చేసుకోపోయినా బాధలేదుగాని తన హృదయం గాయపడే హాస్య బాణాలు విసరకపోతే చాలు!' అనుకుంటూ అప్పట్నుంచీ యింటిదగ్గర ఉండటం బావుండదని కాలేజీకి నడచింది జయ.

ఆలోచనలు సాగిపోతూంటే లెక్చర్ వృథాగా పోతూందని పశ్చాత్తాప పడుతూనే ఆలోచనల కొనకట్ట వేయలేక వోడిపోతూంది జయ. ఎలాగైతేనేం మార్నింగ్ సెక్షన్ కంప్లీటయింది. మెల్ల మెల్లగా జయ యింటిముఖం పడుతూంటే తోటిఅమ్మాయిలు తలో కారణం ఊహించుకుని జయని ఉడికించబోయారు. వారి మాటల కతీతురాలైనట్లు జయ మౌనంగా యింటికి చేరింది.

ఎదురుగ మంచం, పరుపూ, ఫానునుంచి వచ్చే చల్లగాలీ ఆమెను ఆహ్వానించాయ్. రెండు గంటల కలారంపెట్టి మెల్లగా కనుమూసింది జయ.

రెండుగంటలకు లేచి తల్లితో చెప్పకుండానే స్నానం అదీ చేసింది. తనతీరంతా మారిపోయేలా వాలుజడ వేసుకుంది. లాంగని కురులను సంపంగి నూనెతో లాలించి స్నానంచేస్తూ కొంచెం పసుపుకూడ తగిలించింది ముఖానికి శుభలక్షణమని కాదు కాదు. పెళ్ళివారి బాణాలు పనిచేయకుండా ఉండటానికి. గడియారం మూడుకొట్టేటప్పటికి జయ పూర్తిగ తయారయింది. అమ్మ పెళ్లిచూపులకి కట్టుకున్న నెమిలికంఠం రంగు సిల్కుచీర కట్టుకుంటే తన కేవిజయమే ఉండదనికాబోలు అది కట్టుకుంది. గులాబిరంగు పట్టుజాకెట్టూ, ముఖాన కనపడేంత తిలకమూ, కాళ్లకి అలవాటు లేకపోయినా పైపైన పారాణీ, వేలికి ఉంగరం, చేతికి గాజులూ, కాళ్ళకి పట్టీలూ... యింకా... అన్ని అమ్మ వస్తువులే. అసలు కళ్ళకి కాటుక దట్టంగాపట్టించాలా? అనుకుని అమ్మ వచ్చేవరకూ ఆగుదామని అప్పటికే పెళ్లికూతురిలా తయారై కుర్చీలో కూర్చుని జరగబోయేదాన్నిగురించి ఊహించుకుంటూంది.

నాలుగవగానే సుందరమ్మగారు జయగదిలోకివచ్చి ఆమెను చూసి ఆశ్చర్యపోయింది. 'నా బంగారు తల్లివమ్మా! చిలకలా సింగారించుకున్నావ్. అచ్చం

లక్ష్మీదేవిలా ఉన్నావంటే నమ్ము. ఇంకా నిద్ర పోతున్నావేమో లేపాలనుకుంటూ వచ్చేను. కళ్ళకి కొద్దిగా కాటుక పెట్టుకోమ్మా. వాళ్ళూ వస్తారు. ఈలోగా కాఫీ తాగుదూ గాని' అంటూ సుందరమ్మ ఆప్యాయంగా జయని తల నిమిరింది. 'ఈ జయని చూస్తూ ఏ పెళ్ళికొడుకూ వదలలేడమ్మా!' అనుకుంటూ సుందరమ్మ ఫలహారం చెయ్యటానికని లోపలికి వెళ్ళిపోయింది.

కాటుక పెట్టుకున్న జయ కళ్ళలోంచి భయం తొంగిచూస్తూనే ఉంది. నల్లని కాటుకలోంచి కనుపించటంవల్ల ఆ భయం మరికొంచెం హెచ్చు భయంగ కనిపించసాగింది.

ఐదుంపావు అయేసరికి నాన్నగారికి చికాకూ, కేకలు కల్పించకుండా పెళ్ళివారికి ఫలహారాలు అవీ సప్లైచేసి కూతుర్ని పంపింది సుందరమ్మ. బెరుకు బెరుకుగా జయ కూర్చోగానే ఉదయించిందో ప్రశ్న. 'అమ్మాయి యేమేనా చదువుకుందా? సంగీతం భరతనాట్యం యిటువంటివాటిలో ఏమేనా ప్రవేశముందా?

మునుపటి ప్రశ్న వినగానే జయకు గతం జ్ఞాపకం వచ్చి తుళ్ళిపడింది.

'అమ్మాయి మెడిసిన్ చదువుతూంది. సంగీతం అంటే ఏదో సినిమా సంగీతంతప్ప...?' నీళ్లునమిలాడు నాన్న ఏదో తప్పుచేసినట్లు.

'ఆ అమ్మాయి నిజంగా మెడిసిన్ చదువుతూందా?' పెళ్లికొడుకు వేసిన ప్రశ్నకు వళ్లుమండింది జయకు. కాలేజీనుంచి సర్టిఫికేటు తెచ్చి ముఖాన కొడితే! అనుకుంది. యీ సంబంధమూ తప్పిపోతే అనుకుంది.

నాన్న మెల్లగా అడిగాడు 'ఏంబాబూ అలా అడిగావ్? మా కబద్ధం చెప్పవలసిన అవసరమేముంది?'

'అదేమిటండీ, కళ్లకు కాటుక, వాలుజడ, బనారస్ చీరా, పారాణీ, పసుపూ యివన్నీ వేసుకుని ఏ గానకచేరీకో, భరతనాట్యానికో తయారైనట్లున్న ఈ అమ్మాయి మెడిసిన్ చదువుతూందంటే అనుమానంగ ఉంది. బహుశా యీ అమ్మాయికి యిటు చదువూ, అటూ గృహధర్మం ఏదీ వంటబట్టినట్టు లేదు. చదువుకుంటే చదువుకున్నట్లు మోడరైజ్డ్‌గా ఉండాలి. లేదా యింటిని చక్కబెట్టుకునే సంసారిలా గానేనా ఉండాలి. అంతేగాని ఎందుకండి యీ త్రిశంకు స్వర్గం. ఆమెలోలానే ఆమె నామధేయంలోనూ ఏదో అపరిపూర్ణత స్ఫురిస్తూందండీ! క్షమించండి. వస్తాం' అంటూ పెళ్లికొడుకు సిగ్గూ బిడియం లేకుండా 'రా నాన్నా! నాకీ సంబంధంవద్ద' న్నాడు అచ్చం ఇరవయ్యోశతాబ్దపు రెండవ భాగంలోవాడిలా.

గజగజ వణికిపోయింది జయ. రెండుకళ్లల్లోంచీ రెండు కన్నీటి బొట్లు కాటికమీదుగా కదలజొచ్చాయ్. వాలుజడ వెక్కిరించింది. చీర చిరుబురులాడింది, ఆమె శరీరం మీదుండటంవల్ల తమకూ అవమానం వచ్చిందని. ఆ మహానుభావుణ్ని చూద్దామని కనులెత్తినా, అటువంటి వాణ్ని చూస్తే పాపం అన్నట్లు ఆమె కళ్లలోని నీరు దృష్టిని బందుచేసింది. కళ్లు తుడుచుకునేటప్పటికి దిగాలుపడుతూ నాన్న! స్వచ్ఛమైన అరచేతిలో నల్లగా కాటుక మరక, ఏమనడానికీ నోరురాక పోయింది జయకు. తన పెళ్ళి మూలంగా నాన్నకూ అవమానాలూ హేళనలూ. ఛీ ఏం బ్రతుకీ అవ బ్రతుకనుకుని దిగాలుగా గదిలోకి వెళ్ళి వెక్కి వెక్కి ఏడిచింది. సుందరమ్మగారి సముదాయింపువల్ల లాభంలేక పోయింది.

'నీ కెలాగేనా పెళ్ళవుతుందమ్మా!' ఈసంబంధం కాకపోతే మరోకటి! అంది చివరకు సుందరమ్మ జయ పెళ్ళికోసం బెంగపెట్టుకుందేమో అని. కాని ఆమెకేం తెలుసు జయ విచారమంతా మానవుల అసహ్య ప్రవర్తనకని?

కొసకు జయ ఒక నిర్ణయానికి వచ్చింది. తన ఉద్దేశాలు తారుమారయాయ్. ఒకరికొకలాగుంటే యిష్టం. మరొకరికింకోలాగుంటే యిష్టం, తను దురదృష్టవశాత్తు రెండుసార్లూ ఫెయిలయింది. ఏదో ఒక కారణమంటూ రెండు పర్యాయాలూ తను అపజయాన్నే స్వీకరించాల్సి వచ్చింది...ఇక తన జీవితమింతేనా?

అంతలోనే ధైర్యంపుంజుకొంది జయ. ఇటువంటి పెళ్ళిచూ(తూ)పులకి లొంగకుండా, హాయిగ మెడిసిన్ కంప్లీట్ చేసి డాక్టరవగల్గితే యీబాధల కతీతురాలు కావచ్చును అని నిశ్చయించుకుంది జయ...

కాని తన క్లాస్‌మెట్ మధు తనని వివాహం చేసికొమ్మని మరీమరీ బలవంతంచేయటంవల్లా, తనకూ అతనంటే యిష్టం ఉండటంవల్ల, పెళ్ళిచూపుల బారిన పడకుండా, తండ్రి అనుమతితో మధు కౌగిట్లోనే పడింది జయ, రెండు సంవత్సరాల అనంతరం...